గిరిజనుల ఓట్లపైనే దృష్టి

- వైరా నియోజకవర్గంలో 50వేల మందికి పైగానే ఓటర్లు
- అంతకు మించి సంఖ్యలో బీసీలు..
- ఎస్టీ రిజర్వ్‌డ్ కావడంతో ఆ వర్గం ఓటర్లు రాబట్టేలా ప్రణాళిక



వైరా: వైరా నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఈసారి గిరిజనుల ఓట్లపైనే ప్రధానంగా దృష్టి సారించాయి. నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓట్లు గిరిజనవర్గానికే ఉన్నాయి. ఈ నియోజకవర్గం కూడా ఎస్టీకి రిజర్వ్ కావడం, అభ్యర్థులంతా గిరిజనులే కావడంతో ఆ వర్గం ఓటర్లను ఆకట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ గత ఆరేళ్లుగా నియోజకవర్గంలో లంబాడీ సామాజికవర్గానికి చెందిన వారితో పాటుగా అన్నికులాల వారిని కలుపుకుని వెళ్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇక సీపీఐ, టీడీపీ, వైఎస్సార్ టీపీ, కాంగ్రెస్ పొత్తులో భాగంగా కాంగ్రెస్ నుంచి లంబాడీ సామాజికవర్గానికే చెందిన మాలోత్ రాందాస్‌ను బరిలోకి దించారు. మరోపక్క బీఎస్పీ, బీజేపీ బలపర్చిన జనసేన, సీపీఎం పార్టీలు సైతం సీపీఎంకు చెందిన భూక్యా వీరభద్రంను పోటీలో నిలిపారు.

గిరిజనేతరులూ కీలకమే..

నియోజకవర్గంలో లంబాడీ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు సుమారు 50 వేల వరకు ఉంటారని అంచనా.. వీరే కాక కమ్మవర్గానికి చెందిన వారు సుమారు 35 వేల మంది ఉండగా.. మాదిగలు 25వేలు, మాలలు 20వేలు, యాదవులు 16వేలు, మున్నూరుకాపుల ఓట్లు 20వేల వరకు ఉంటాయి. మరోపక్క కోయల ఓట్లు 15 వేలు, ముస్లింలు 8వేలు, గౌడ 10వేల ఓట్లు, ముదిరాజ్ 3వేలు, పద్మశాలీలు 3,300, రెడ్డి 4,550, వైశ్యులు 6వేలు, విశ్వబ్రాహ్మణ 4,982, రజక 5,655, కుమ్మరి 3,740, మంగలి 3,311, దూదేకుల ఓట్లు 4,380 ఓట్లు ఉన్నాయి. తద్వారా నియోజకవర్గంలో గిరిజనుల ఓట్లు ఎంత కీలకమో గిరిజనేతరుల ఓట్లు కూడా అంతే ప్రధానం కానున్నాయి.

ఈ నియోజకవర్గంలో మొత్తం 1,93,069 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 94,057మంది, మహిళలు 99,005 మంది ఉన్నారు. గిరిజనేతరుల్లో జనాభాపరంగా బీసీలు 75వేల మేర ఉండడం విశేషం. ఎస్సీలు 40 వేలు, ఎస్టీలు 70వేలు, ఇతరులు 67,102 మంది జనాభా ఉంటుంది. జనాభా ప్రాతిపదికగానే ఓట్ల సంఖ్య కూడా గిరిజనేతర వర్గాలు ఎక్కువ కావడం ఈ నియోజకవర్గం ప్రత్యేకత.

వైరాలో తక్కువ..

నియోజకవర్గ పరిధిలోని వైరా మండలంలో గిరిజనుల సంఖ్య చాలా స్వల్పమే. దీంతో గిరిజనేతర ఓటర్లే ఈసారి అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశముంది. పూర్తిగా మైదాన ప్రాంతంలో ఉన్న వైరా మండల ఓటర్ల మదిని దోచుకునే వారు విజయానికి చేరువయ్యే అవకాశముందని భావిస్తున్నారు. కారణాలేమిటో, అభ్యర్థులు మదిలో ఏముందో తెలియకున్నా నియోజకవర్గంలోని కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు, కారేపల్లి మండలాల్లో పర్యటించిన స్థాయిలో గిరిజన నేతలు ఈ మండలంలో పర్యటించకపోవటం విశేషం.

క్లుప్తంగా

ఓటే వజ్రాయుధం



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

సత్తుపల్లిటౌన్: ప్రజాస్వామ్యంలో తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఓటే వజ్రాయుధం వంటిదని సత్తుపల్లి గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేష్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో ఓటు చైతన్య యాత్రలో భాగంగా కొత్త ఓటర్లను కలుసుకుని ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు.

ఎన్‌సీసీ పతాక దినోత్సవ వేడుకలు



విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ పతాక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేర్ టేకర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లు పట్టణంలోని పలు ప్రాంతాలలో తిరిగి రూ.39,647నగదును విరాళాల రూపంలో సేకరించారు. ఈ నిధులను నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోని కార్యదర్శి న్యూఢిల్లీకి పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామచంద్రరావు, విజయలక్ష్మి, పీర్ సాహెబ్, రాజు పాల్గొన్నారు.

ఎల్ఈడీ టీవీ వితరణ



ఎల్ఈడీ టీవీ అందిస్తున్న లయన్స్ సభ్యులు

వైరారూరల్: మండలంలోని పుణ్యపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం శుక్రవారం కొణతపల్లి ఆర్థిక సాయంతో లయన్స్‌క్లబ్ బాధ్యులు రూ.15 వేలు విలువ చేసే ఎల్ఈడీ టీవీని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేంద్రరావు, అబ్బూరి రమేష్, చింతోజు నాగేశ్వరరావు, కట్ల సురేస్, హెచ్‌ఎం పోలూరి సనత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎంసీ గ్రేడ్-3 సెక్రటరీ లక్ష్మణ్ మృతి

మధిర: మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-3 సెక్రటరీ భూక్యా లక్ష్మణ్ (58) శుక్రవారం మృతి చెందారు. ఆయన మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-3 కార్యదర్శిగా గత మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఖమ్మం రాపర్తినగర్‌లో నివసిస్తున్న లక్ష్మణ్ ప్రతిరోజు మధిరకు వచ్చి విధులకు హాజరవుతుంటారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ.. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పార్టీ అభ్యర్థుల ప్రచారాలు..

వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

ముదిగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జెడ్పీ చైర్మన్, మధిర బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్, జెడ్పీటీసీ దుర్గ, ప్రసాద్, వీరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలను ఓడించండి..

తల్లాడ: అవకాశ వాద రాజకీయాలను ఓడించి నీతి నిజాయతీగా పనిచేసే సత్తుపల్లి సీపీఎం అభ్యర్థి మాచర్ల భారతిని గెలిపించాలని ఆ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని రమేష్ అన్నారు. తల్లాడలో శుక్రవారం దొడ్డా కృష్ణయ్య భవనంలో జరిగిన సీపీఎం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రామలింగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, మోహన్‌రావు, వెంకటనరసయ్య, ఫకీరమ్మ, మస్తాన్, సాహెబ్ పాల్గొన్నారు.

పోరాడే పార్టీలను గెలిపించుకోవాలి..

వైరారూరల్/కారేపల్లి: ప్రజా పోరాటాలతో సీపీఎం ముందడుగు వేస్తుందని వైరా సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్ర, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వైరా, కారేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రజలకు న్యాయం జరగాలంటే సుత్తికొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అదే విధంగా కారేపల్లిలో ఉసిరికాయలపల్లి గ్రామంలో సర్పంచ్ బానోత్ బన్సిలాల్ తండ్రి దేవ్లా(85) అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలల్లో రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, రాంబాబు, నాగేశ్వరరావు, సుధాకర్ , సీపీఎం రాష్ట్ర నాయకులు శోభన్, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీదే అధికారం..

పెనుబల్లి/తల్లాడ: పెనుబల్లి, తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో సత్తుపల్లి బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావుతో పాటు ఆ పార్టీ అభ్యర్థి మాలోత్ రాందాస్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సారి కషాయ జెండా ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు నరసింహారావు, జిల్లా అధికార ప్రతినిధి మదుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి రాము, వెంకట్రామయ్య, భాస్కర్‌ని వీరంరాజు, ఎస్టీ మోర్చా అధ్యక్షులు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మహేష్, బీజేపీ సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు, కృష్ణారావు, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌దే..

వైరారూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అభ్యర్థి మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో డీసీసీబీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, రంగారావు, వెంకటనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి విద్యార్థుల ప్రతిభ

మధిర: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో మధిరకు చెందిన శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా కరాటే జట్లను సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియం ఖమ్మంలో శుక్రవారం అండర్ 14, అండర్ 17 సెలక్షన్స్ నిర్వహించగా విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేశారు. పెరుమాళ్లపల్లి కిషన్ రాజు అండర్ 14, 60 కేజీల కేటగిరిలో, పి.వెంకట ధనుష్ అండర్ 17, 50 కేజీల కేటగిరిలో, మధుకర్ రెడ్డి అండర్ 17, 38 కేజీల కేటగిరిలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అంజన్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థులు డిసెంబర్ 5 నుంచి నల్గొండ జిల్లాలో జరిగే అండర్ 14, అండర్ 17 విభాగాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చందు, కరాటే మాస్టర్ వీరన్న, పీఈటీ ప్రవీణ్ కుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

మధిర: మద్యం సేవించి ఆటో నడిపిన డ్రైవర్‌కు నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ మధిర ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్‌రెడ్డి నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కొత్తపల్లి రవి గురువారం రాత్రి మధిర నుండి మడుపల్లి మీదుగా కోదాడ వెళ్తున్నాడు. అక్కడి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయడంతో రవి మద్యం సేవించి ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. ఈమేరకు రవికి రూ.పది వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పగా, తాను జరిమానా కట్టలేనని విన్నవించడంతో నాలుగు రోజుల జైలు శిక్షగా తీర్పును సవరించారు.

సాహసోపేతంగా.. విధులు

ముదిగొండ: మండలంలోని మల్లన్నపాలెంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 132–11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నూతనంగా నిర్మాణం జరుగుతోంది. దీంతో పాటు విద్యుత్ లైన్‌ల పనుల నిమిత్తం భారీగా 100అడుగుల ఎత్తులో హైటెన్షన్ లైన్‌ల పనులు తాళ్ల సాయంతో చేపట్టారు. పదిమంది టెక్నీషియన్లతో కలిసి ఎత్తైన ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లు లాగేందుకు టవర్ చివరి వరకు ఎక్కి సాహసోపేతంగా పనులు చేపడుతున్నారు. రూ.30 కోట్లతో చేపట్టే ఈ పనులకు సంభందించి ఈ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేందుకు ముదిగొండ మండలంతో పాటు చింతకాని నేలకొండపల్లి, సబ్‌స్టేషన్లకు 24గంటలు మెరుగైన విద్యుత్ సరఫరా ఇక్కడ నుంచే త్వరలో కానున్నది.



విద్యుత్ టవర్‌లైన్‌ల పనులు చేపడుతున్న టెక్నీషియన్ →

మరోమారు ఆశీర్వదించండి



సత్తుపల్లి: జామే మసీద్‌లో ముస్లింలను కలిసిన సండ్ర వెంకటవీరయ్య



కల్లూరురూరల్: బీఆర్ఎస్ మేనిఫెస్టో అందిస్తున్న సంభాని, నాయకులు

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్/వేంసూరు: నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే తనను మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం జామే మసీద్ వద్ద ముస్లింలను ఆలింగనం చేసుకుని మీరంతా కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. ముస్లింల ఈద్గాను అభివృద్ధి చేయడమే కాకుండా చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేశానని, ఉర్దూ మదర్సాను రూ.25లక్షల మౌళిక సదుపాయాల కల్పన చేశామన్నారు. సీఎం కేసీఆర్‌తోనే ముస్లిం, మైనార్టీల అభివృద్ధి జరిగిందన్నారు. అదే విధంగా స్థానిక మాధురీ ఫంక్షన్‌హాల్‌లో గొల్ల కురుమ యాదవుల సమావేశంలో మాట్లాడారు. గొల్ల కురుమ యాదవులకు రెండో విడత గొర్రెల పంపిణీ చేయకపోతే పంచాయతీ ఎన్నికలకు ఓట్లు అడగనని స్పష్టం చేశారు. ముందుగా పట్టణంలోని 14వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే విధంగా జేవీఆర్ కళాశాలలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఓట్లు అభ్యర్థించారు. వేంసూరు మండలంలోని లచ్చన్నగూడెం, మర్లపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించి సంక్షేమాభివృద్ధి పనులు చేసుకుంటూ ప్రజలకు భరోసానిచ్చే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ప్రజలు ఆలోచించి పనిచేసే ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే.రఫీ, ఎస్‌కే.చాంద్‌పాషా, ఎస్‌కే.మౌలాలీ, ముఖరం హుస్సేన్, అద్దాల మీరా, ఎస్‌కే.ఇబ్రహీం, ఎండీ.అజార్, ఎస్‌కే.ఆయూబ్ పాషా, ఎస్‌కే.ఖాసీం, ఎంఏ.పాషా, ఎస్‌కే.మదార్, మండల పార్టీ అధ్యక్షుడు పాలా నర్సిరెడ్డి, మల్లేశ్వరరావు, సోమిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ మహేష్, ఆత్మ చైర్మన్ వాసు, చాంద్‌పాషా, పవన్, అనీల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సండ్ర గెలుపును కాంక్షిస్తూ..

కల్లూరురూరల్: సత్తుపల్లి ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్య గెలుపును కాంక్షిస్తూ మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కల్లూరు మండలంలోని చంద్రుపట్లలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘు, నాయకులు దుర్గాప్రసాద్, కిరణ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, వంశీ, బాబురావు, రత్నాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



తల్లాడ: మాట్లాడుతున్న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



మధిరరూరల్: విలేకరుల సమావేశంలో పాల్గొన్న మల్లు నందిని విక్రమార్క, నాయకులు

తల్లాడ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం తల్లాడ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మహిళ ఎకౌంట్లో నెలకు రూ.2500, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ బండ, ధాన్యంకు రూ.500 బోనస్‌తో పాటు మద్దతు ధర, రైతు బంధు పేరుతో ఎకరానికి రూ.12 వేలు, గృహలక్ష్మీ కింద రూ.5 లక్షలు, ఆడబిడ్డల పెండ్లికి రూ.లక్ష రూపాయలు, తులం బంగారం, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం వంటి పథకాలను వెంటనే అమలు చేస్తామన్నారు. కల్లూరులో మట్టా రాగమయి గెలుపు కాంక్షిస్తూ నేడు జరగనున్న ప్రియాంకగాంధీ రోడ్‌షోను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి, నాయుడు సత్యం, దగ్గుల రఘుపతిరెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, దీవెల కృష్ణయ్య, కాపా సుదాకర్, వడ్డే రామారావు, అయిలూరి బాబు, దగ్గుల నాగిరెడ్డి, యర్రి నరసింహారావు, కటికి కిరణ్‌కుమార్, కేతేపల్లి బాస్కర్ రావు, డి.వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎర్రి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి..

మధిరరూరల్: మధిర పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఈ నెల 25న ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని పిలుపునిచ్చారు. శుక్రవారం భట్టి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భట్టి విక్రమార్కను ఆశీర్వదించడానికి ప్రియాంక గాంధీ మొట్టమొదటిసారిగా మధిరకు వస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్య స్థాపన కోసం, ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కోసం ఇందిరమ్మ మనవరాలు, రాజీవ్, సోనియా గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వివిధ పార్టీల నాయకులు సూరంశెట్టి కిషోర్, మెండెం లలిత, మల్లాది హనుమంతరావు, కోనా ధనికుమార్, పారుపల్లి విజయ్ కుమార్, బెజవాడ రవిబాబు, అద్దంకి రవికుమార్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భట్టిని గెలిపించాలని ప్రచారం..

ఎర్రుపాలెం: మండలంలోని ములుగుమాడు గ్రామంలో శుక్రవారం రాత్రి మాజీ సర్పంచ్ గంటా తిరుపతమ్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్కను గెలిపించాలని కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు.

ప్రియాంక పర్యటనకు తరలిరండి



సత్తుపల్లి: మాట్లాడుతున్న విజయబాబు

సత్తుపల్లి: సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి విజయాన్ని కాంక్షిస్తూ ఏఐసీసీ నేత ప్రియాంకగాంధీ కల్లూరులో శనివారం జరిగే రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు తెలిపారు. ఈ కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు. సత్తుపల్లిలోని మట్టా రాగమయి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కలిసి పనిచేస్తున్నారని.. కార్యకర్తలు కూడా అదే స్ఫూర్తితో వర్గాలకతీతంగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పదేళ్లు పడిన కష్టాలు తీరుతాయనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈసమావేశంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, చల్లగుళ్ల నరసింహారావు, కూసంపూడి నరసింహారావు, మందపాటి ముత్తారెడ్డి, ఉడతనేని అప్పారావు, కొత్తూరు ప్రభాకరరావు, శివా వేణు, తోట సుజలరాణి, దండు ఆదినారాయణ, ఎస్‌కే.మౌలాలీ, గోలీ శ్రీనివాసరెడ్డి, గాదె చెన్నారావు, బొంతు శ్రీనివాసరావు, పోట్రు రామారావు తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ సిద్ధం..

కల్లూరు: కాంగ్రెస్ సత్తుపల్లి అభ్యర్థి మట్టా రాగమయి తరఫున శనివారం కల్లూరులో ప్రచారంలో ఏఐసీసీ నేత ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కల్లూరులోని తిరువూరు క్రాస్ వద్ద హెలీప్యాడ్ సిద్ధం చేశారు. ఈమేరకు ఏర్పాట్లను నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కొత్తూరు ప్రభాకర్‌రావు తదితరులు శుక్రవారం పరిశీలించారు.

నేడు బృందాకారత్ రోడ్ షో

కొణిజర్ల: వైరా నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రాన్ని గెలిపించాలని కోరుతూ సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ కొణిజర్ల, వైరా మండలాల్లో రోడ్ షో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ తెలిపారు. శుక్రవారం తనికెళ్ల, కొణిజర్ల, చిన్నగోపతి, అమ్మపాలెం గ్రామాల్లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తనికెళ్ల బహిరంగ సభలో ప్రసంగించి అనంతరం కొణిజర్ల మీదుగా వైరా వరకు రోడ్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రోడ్ షో పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, సాంబశివరావు, గోపయ్య, చిన్నదానయ్య, కుమారి, రాములు, భాస్కర్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం గ్రామంలో శుక్రవారం రాత్రి పలువురు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ దేవరకొండ శిరీష, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు పంబి సాంబశివరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివాజీ, ఎంపీటీసీ కిషోర్‌బాబు, నాయకులు కృష్ణారెడ్డి, గాంధీనారాయణరెడ్డి, భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, అనీల్, కిరణ్, సుబ్బారావు, ముత్తయ్య, శ్యాంబాబు, కిషోర్, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

భట్టి సమక్షంలో..

మధిర: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మధిర నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మధిర మండలంలోని నిదానపురం గ్రామ సర్పంచ్ బాదా కృష్ణారెడ్డి, చింతకాని మండలం పందిళ్లపల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎనుకుల బ్రహ్మారెడ్డి, మండల ముఖ్య నాయకులు మేకల సత్యనారాయణ, చల్లా వెంకటేశ్వరరావు, దండేల తిరుపతి ఆధ్వర్యంలో భట్టి క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఏఎంసీ చైర్మన్..

వైరా: వైరాలో రాందాస్ నాయక్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైరా మాజీ ఏఎంసీ చైర్మన్ సీనియర్ నాయకుడు షేక్ సోందు సాహెబ్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ రాందాస్‌నాయక్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, పీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్ రంగారావు, నాగి, రోశయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సూరంపల్లి రామారావు సమక్షంలో..

కొణిజర్ల: కొణిజర్లతో పాటు బోడియాతండా గ్రామంలో పలు కుటుంబాల వారు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సూరంపల్లి రామారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బోడియాతండాకు చెందిన పిచ్చయ్య, రామదాసు, సుక్కు, సాజు, హనుమా, శ్రీను, రాముడు, షాజీరావు, ధర్మా, భీమ్లాల నాయకత్వంలో సుమారు 150 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ సూరంపల్లి రామారావు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి.. పార్టీ అండగా ఉంటుందన్నారు.

టీబీ నిర్మూలనపై అవగాహన



కుర్నవల్లిలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి, ముద్దునూరు గ్రామాల్లో శుక్రవారం మండల వైద్యాధికారి రత్న మనోహర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్న మనోహర్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లాడ పీహెచ్‌సీలో 57 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ పెద్ద పుల్లయ్య, సూపర్‌వైజర్ సురేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.